క్లుప్తంగా

ఇంటి నిర్మాణానికి వీజేఆర్ చేయూత



మాగనూర్: మండలంలోని అమ్మపల్లికి చెందిన పుండుకూర నర్సమ్మ, శివప్పలకు చెందిన ఇళ్లు వర్షాలకు కూలిపోవడంతో వలంటరీ ద్వారా సమాచారం అందుకున్న వీజేఆర్ ఫౌండేషన్ అధినేత వర్కటం జగన్నాథ్‌రెడ్డి శనివారం ఆర్థికసాయంగా రూ. 5వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేదలను ఆదుకోవడమే తన లక్ష్యమని, వారిని ఆదుకునేందుకు వీజేఆర్ ఫౌండేషన్ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో వీజేఆర్ ఫౌండేషన్ వలంటరీలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అన్నిరంగాల్లో రాణించాలి



కోస్గి: తొగుట వీరక్షత్రియులు అన్నిరంగాల్లో రాణించాలని జిల్లా అధ్యక్షుడు చింత శంకర్ తెలిపారు. శనివారం పట్టణంలోని చౌడేశ్వరీ ఆలయంలో జిల్లా రెండో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యలో ఉత్తమఫలితాలు సాధించిన విద్యార్థులకు పురస్కారాలతోపాటు, ఉన్నత పదవులు సాధించిన వారికి సన్మానించాలని తెలియజేశారు. అందరూ ఐక్యమత్యంతో సంఘం అభివృద్ధికోసం కృషిచేయాలని తీర్మానించారు. కార్యక్రమంలో మురళీమోహన్, బాల్‌రాజ్, రాములు, విఠల్, నర్సింహులు, లక్ష్మీనారాయణ, కృష్ణయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలి




ఊట్కూరు: ప్రభుత్వం పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని సీపీఎస్ ఉద్యోగుల సంఘం నాయకులు గోవర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్‌లో జరిగే బహిరంగ సభకు మండలం నుంచి ఉపాధ్యాయులు, ఉద్యోగులు ప్రత్యేక వాహనాల్లో బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎస్‌ను రద్దు చేసి వెంటనే పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. తరలివెళ్లిన వారిలో నాయకులు సాయిలు, ఆనంద్, మహేశ్, గోపాల్, శ్రీవిద్య, అనిత, చంద్రకళ, గోవిందమ్మ తదితరులు ఉన్నారు.

హైదరాబాద్‌కు తరలిన సీపీఎస్ ఉద్యోగులు

నారాయణపేట రూరల్: జిల్లాలో పనిచేస్తున్న సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులు శనివారం హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో జరుగుతున్న ఓపీఎస్ సాధన బహిరంగ సభకు తరలివెళ్లారు. స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో తపస్ జిల్లా అధ్యక్షుడు శేరి కృష్ణారెడ్డి, పీఆర్‌టీయూ జిల్లా కార్యదర్శి జనార్దన్‌రెడ్డి జెండా ఊపి వాహనశ్రేణిని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 3.35 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆకాంక్షలను నెరవేర్చాల్సిన బాధ్యత కేసీఆర్‌పై ఉందన్నారు. పదవీవిరమణ తర్వాత పెన్షన్ లేకపోవడంతో 19ఏళ్లుగా ఎన్నో సీపీఎస్ కుటుంబాలు మానసిక అస్థిరతకు లోనవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నర్సింహ, శ్రీనివాస్, విశ్వనాథ్‌రెడ్డి, రఘువీర్, శంకరప్ప, జహంగీర్, నరేష్, జానకిరాములు, తిరుపతినాయక్, తార్యానాయక్, రవి, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



మద్దూరు: కొత్తపల్లి మండలంలోని లింగల్‌చేడ్ వద్ద పెద్దవాగు రూ. 8 కోట్ల 60 లక్షలతో భారీ చెక్‌డ్యాం నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. శనివారం లింగల్‌చేడ్, తిమ్మారెడ్డిపల్లి, ఎక్కమేడ్, నందిగామ, కొత్తపల్లి, మన్నాపూర్ తదితర గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు, రైతులు కేసీఆర్, ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ చెక్ డ్యాం మంజూరుకు కృషి చేసినా ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నరేందర్‌రెడ్డి, మల్లేష్, నారాయణ, గోవర్ధన్‌రెడ్డి, ఎల్లప్ప, తిరుపతి, గ్రామాల రైతులు పాల్గొన్నారు.

రేపు మండల సమావేశం

కృష్ణా: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంపీపీ పూర్ణిమ పాటిల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి హాజరవుతున్నారని, అన్నిశాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

పార్టీ పటిష్టతకు కృషి చేయాలి

- ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి



ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరుతున్న ఇతర పార్టీల కార్యకర్తలు

ఊట్కూరు: బీఆర్‌ఎస్ పార్టీ పటిష్టతకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం చిన్నపొర్ల గ్రామానికి చెందిన బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వారికి ఆయన కండువా కప్పి బీఆర్‌ఎస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం పేద బడుగు బలహీన వర్గాలకు వివిధ సంక్షేమ పథకాలను చేపడుతుందని తెలిపారు. గృహలక్ష్మి పథకం ద్వారా ఇళ్లులేని నిరుపేదలకు రూ. 3 లక్షలు మంజూరు చేస్తుందని తెలిపారు. రైతులకు రూ. లక్ష వరకు బ్యాంకుల్లో రుణాలను మాఫీ చేస్తుందన్నారు. ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేసి నియోజకవర్గంలో మరోమారు గులాబీ జెండాను ఎగురవేయాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రవిప్రసాద్‌రెడ్డి, నాయకులు అనిల్‌కుమార్‌రెడ్డి, నర్సింహారెడ్డి, ఇర్షాద్, ఇర్ఫాన్, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు



కృష్ణా: మండలంలోని కున్సిగ్రామంలో శనివారం విజయరాజ్ తిలక్ సురూజీ ప్రవేశించి, ఆయన భక్తుడైన శివప్పసాకార ఇంటిలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ మేరకు భక్తులు మాట్లాడుతూ.. స్వామిజీ కున్సిగ్రామానికి చెందిన ఓ సామాన్య కుటుంబంలో జన్మించి ఈ రోజు జైన మతంలో ఎన్నోదేశాల భక్తులకు ఆయన ఆరాధ్యదైవంగా కొనసాగుతున్నారని గుర్తుచేశారు. ఆయనతోపాటు బాలముని గురూజీ, గ్రామ నాయకులు అంజప్పగౌడ, సోమశేఖర్‌గౌడ్, నర్సప్ప, పిట్టల్ సిద్దప్ప, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం



నారాయణపేట రూరల్: పట్టణంలోని వివిధ ఆలయాల్లో శనివారం సాయంత్రం హనుమాన్ చాలీసా పారాయణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గత 9వారాల నుంచి వరుసగా చేపడుతున్న కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారు. గొడుగుగేరి, గాంధీనగర్, పళ్ల హనుమాన్ మందిరాలలో ఓంకారం కార్యక్రమం విజయవంతమైంది. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి హారతి చేశారు. భక్తులకు తీర్థ, ప్రసాద వితరణ నిర్వహించారు.

95వ రోజుకు కొనసాగిన దీక్షలు



నారాయణపేట రూరల్: కోటకొండ మండల సాధన దీక్షలు శనివారం 95వ రోజు కొనసాగాయి. వివిధ గ్రామాల ప్రజలు శిబిరంలో కూర్చోగా వారికి సాధన సమితి సభ్యుడు దండలు వేసి ప్రారంభించారు. బి.రాము, చెన్నప్పయాదవ్, యాదగిరి, బాలరాం, కెంచెశ్రీనివాస్ మాట్లాడారు. అనంతరం జీపీ భవనంలో ఏర్పాటుచేసిన అఖిల పక్ష సమావేశంలో చుట్టు పక్కల గ్రామాల నుంచి పెద్దఎత్తున ప్రజలు హాజరై భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. వందోరోజు జిల్లా కేంద్రంలో భారీ బహిరంగసభ నిర్వహించాలని తీర్మానించారు. కోటకొండ మండల ఆకాంక్ష నెరవేర్చడానికి ప్రతి గ్రామం నుంచి పెద్దఎత్తున ప్రజలను చైతన్యపర్చి తీసుకుని రావాలని సూచించారు.

యుద్ధభేరిని జయప్రదం చేయండి



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

మాగనూర్: యాదవ సంఘం ఆధ్వర్యంలో ఆగస్టు 25న నిర్వహించే యాదవ్ యుద్ధభేరిని జయప్రదం చేయాలని అఖిల భారత యాదవ మహాసభ జిల్లా కన్వీనర్ తిరుపతి కోరారు. శనివారం యాదవ్‌సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని జెడ్పీఉన్నత పాఠశాలలో యాదవ్ యుద్ధభేరి వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీపీ మండల్ 105 జయంతి సందర్భంగా బీసీల రిజర్వేషన్ల ప్రదాత బీపీ మండల్ అంశాలను అమలు చేయాలన్నారు. రాజకీయ పార్టీలు యాదవులను ఓటు బ్యాంక్‌కోసం మాత్రమే వాడుకొని రాజకీయ పదవులు కాకుండా గొర్రెలు, బర్రెలు ఇవ్వడం కాదని, రాజకీయ ఆర్థిక రంగాల్లో వాటా కోసం ఈ యుద్ధభేరిని నిర్వహిస్తున్నామన్నారు. అదేవిధంగా యాదవ కార్పొరేషన్ ఏర్పాటుచేసి నిధులు కేటాయించాలన్నారు. హైదరాబాద్‌లోని నాగోల్ చింతల లక్ష్మణ్‌రావు ప్రాంగణంలో నిర్వహించే యుద్ధబేరి కార్యక్రమానికి బీపీ మండల్ మనవడు సూరజ్‌కుమార్ మండల్ ముఖ్యఅతిథిగా హాజరవుతున్నారని, సభను విజయవంతం చేయాలని కోరారు. కారక్రమంలో యాదవ సంఘం జిల్లా నాయకులు రఘువీర్‌యాదవ్, ఒబ్లాపూర్ సర్పంచ్ నారయణ, నర్సింహ, ప్రభు, యాదవ్ చిన్నా, నాగేష్, మొగులప్ప, నర్సింహులు పాల్గొన్నారు.

గిరిజనులకు రిజర్వేషన్లు కల్పించింది కాంగ్రెస్సే..



సమావేశంలో మాట్లాడుతున్న శివకుమార్‌రెడ్డి

ధన్వాడ: గిరిజనులకు రిజర్వేషన్లు కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని నియోజకవర్గ ఇన్‌చార్జ్ కుంబం శివకుమార్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ఆకుమర్రి తండా, పోడుగుట్ట తండాలో కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరణ నిర్వహించారు. జెండావిష్కరణ అనంతరం నిర్వహించిన పార్టీ చేరికలో గ్రామస్తులను కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను వచ్చే ఎన్నికల్లో పార్టీ ఆశీర్వాదంతో ఎమ్మెల్యేగా గెలిస్తే మొదటగా ఆకుమర్రితండాకు రోడ్డుపనులు పూర్తిచేసి గ్రామాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నరహరి, యువజన సంఘం అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, విద్యాసాగర్, రాఘవేందర్‌రెడ్డి, రవి నాయక్, సర్పంచ్‌లు రాములు, దామోదర్‌రెడ్డి, గోరిబాయ్, రాందాస్, గోపాల్‌రెడ్డి, లక్ష్మయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్ర సత్యంకు ఘన నివాళి



పేటలో ఎర్ర సత్యం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నారాయణపేట: ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో దివంగత మాజీ ఎమ్మెల్యే ఎర్రసత్యం వర్ధంతిని శనివారం పట్టణంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన ఆత్మశాంతికి 2 నిమిషాలు మౌనం పాటించి పట్టణంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు సరాఫ్ నాగరాజు, పట్టణ అధ్యక్షుడు మిర్చి వెంకటయ్య ముదిరాజ్ సంఘం నాయకులు కాకర్ల భీమయ్య మాజీ డీసీసీబీ చైర్మన్ చింత వెంకటయ్య మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి సత్యమన్న అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గురులింగప్ప, ఓంప్రకాశ్, గురు మేస్త్రీ, పళ్ల వెంకట్రాములు, కార్తీక్, హన్మంతు, శ్రీనివాస్, సంజీవ్‌ప్రకాశ్, రాజు, పాండు పస్పుల రవి, మన్నే రామకృష్ణపాల్గొన్నారు.

దామరగిద్ద: మండల కేంద్రంలోని పంచాయతీ ఆవరణలో దివంగత మాజీ ఎమ్మెల్యే ఎర్రసత్యం వర్ధంతి సందర్భంగా శనివారం ముదిరాజ్ సంఘం నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో హన్మంతు, పీఏసీఎస్ చైర్మన్ ఈదప్ప, సర్పంచ్‌లు ఆశమ్మ, చంద్రకాంత్, సుభాష్, మొగులప్ప, నీలి వెంకట్రాములు, ఉప సర్పంచ్ శ్రీనివాస్, వెంకటేష్, వెంకటయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.

మరికల్: మండలంలోని పెద్దచింతకుంటలో దివంగత మాజీ ఎమ్మెల్యే ఎర్రసత్యం వర్ధంతిని శనివారం ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అంజిరెడ్డి, తిమ్మన్న, రాజు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థి ప్రతిభ

ఆత్మకూర్: పట్టణానికి చెందిన వైద్య విద్యార్థి శివవరుణ్ ఎంబీబీఎస్ పూర్తిచేసి హౌస్ సర్జన్‌లో డాక్టరేట్ పట్టాను సాధించి ప్రతిభను చాటాడు. శ్రీవాణి హైస్కూల్ అధినేత టీజే విశ్వేశ్వర్, చైతన్యరాణి దంపతుల కుమారుడు శివవరుణ్ 2017లో ఉచితంగా ఎంబీబీఎస్ సీటును సాధించాడు. కరీంనగర్‌లోని ప్రతిమ మెడికల్ కళాశాలలో 2022లో ఎంబీబీఎస్ పూర్తిచేసి, 2023 సంవత్సరానికి గాను రాష్ట్ర స్థాయిలో హౌస్‌సర్జన్‌లో అత్యుత్తమ ప్రతిభను కనబర్చి కళాశాల డీన్ జాన్‌ఇజ్రాయిల్ చేతుల మీదుగా శుక్రవారం రాత్రి డాక్టరేట్‌ను అందుకున్నాడు. ఈసందర్భంగా డాక్టర్ శివవరుణ్‌ను ప్రజాప్రతినిధులు, అధికారులు అభినందించారు.

ఐరన్ స్తంభాలతో ముప్పు

- తరచూ ప్రమాదాలతో స్థానికుల భయాందోళన
- విన్నవించిన పట్టించుకోని ట్రాన్స్‌కో అధికారులు
- సిమెంట్ స్తంభాలు ఏర్పాటుచేయాలని వినతి



ఇళ్ల మధ్య ఉన్న ఇనుపట్రాన్స్‌ఫార్మర్



బురిడివాడ వెళ్లేదారిలో ఐరన్ స్తంభం

నారాయణపేట టౌన్: పట్టణంలోని 21వ వార్డు పరిధిలోని సుమారు నలభై ఏళ్ల కిందట ఏర్పాటు చేసిన ఐరన్ స్తంభాలతో ముప్పు పొంచి ఉంది. ప్రస్తుతం ప్రమాదకరంగా మారిన వీటిని తొలగించడంలో విద్యుత్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు మలుపు వద్ద ఐరన్ స్తంభాలతో ప్రమాదం పొంచి ఉన్న పట్టించుకొనే పరిస్థితి లేదని వాపోతున్నారు. వర్షకాలంలో ప్రారంభంలో ఐరన్ స్తంభాల ద్వారా ఎర్తింగ్ రావడంతో విద్యుత్ సరఫరా అవుతుందని, దీంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

ఐరన్ స్తంభాలతో ఇబ్బందులు..

పట్టణంలోని 21 వార్డు పరిధిలో 4, నుంచి 6 వరకు ఐరన్ స్తంభాలతో పాటు ట్రాన్స్‌ఫార్మర్‌లు అలాగే ఉన్నాయి. దీంతో వర్షకాలంలో ఎర్తింగ్, విద్యుత్‌షాక్ వంటి ప్రమాదాలు జరుగుతున్న అధికారులకు విన్నవించిన పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అలాగే పలు కాలనీలో ఐరన్, ఇనుప స్తంభాలు ఉండటంతో అక్కడక్కడ రాత్రి వేళలో కనిపించని కారణంగా ప్రమాదం పొంచి ఉందని వెంటనే వాటిని తొలగించేలా అధికారులు చర్యలు తీసుకొని సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

అధికారి వివరణ...

పట్టణంలో ఎక్కడెక్కడ ఐరన్ పోల్స్ ఉన్నాయో పరిశీలించి, విద్యుత్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం. ఎలాంటి సమస్య రాకుండా చర్యలు తీసుకుంటాం.

– మహ్మద్ రఫీ, పట్టణ ఏఈ, నారాయణపేట

ఉద్యమాలతోనే సమస్యల పరిష్కారం



మున్సిపల్‌పార్క్ వద్ద ధర్నా చేస్తున్న నాయకులు

నారాయణపేట రూరల్: సమస్యల సాధనకు ఐక్యంగా పోరాటం చేస్తే పరిష్కారం దొరుకుతుందని యూపీఎస్‌సీ నాయకులు అన్నారు. స్థానిక శ్రీవివేకానంద మున్సిపల్‌పార్క్ వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వెంటనే పీఆర్‌సీ కమిటీని వేసి జూలై 1 నుంచి ఐఆర్‌ను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ట్రెజరీలో ఆమోదం పొందిన సప్లమెంటరీ బిల్లులు, సెలవుజీతాలు, జీపీఎఫ్, టీఎస్‌జీఎల్‌ఐ క్లెయిమ్స్, పెన్షన్ బెనిఫిట్స్, పీఆర్‌సీ బకాయిలు ఏడాది కాలంగా చెల్లించలేదని వాపోయారు. పీఈటీ, పండితుల అప్‌గ్రేడేషన్ ప్రక్రియ పూర్తిచేయాలని, సీపీఎస్ రద్దుచేసి పాతపెన్షన్ విధానం అమలు చేయాలన్నారు. పాఠశాలల్లో ఖాళీలు భర్తీచేసి స్కావింజర్లను ఏర్పాటు చేయాలన్నారు. సమస్యలు పరిష్కరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సెప్టెంబర్ 1న చలో హైదరాబాద్ నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రెడ్డప్ప, బాలాజి, వేణుగోపాల్, సూర్యచంద్ర, శివరాములు, రామకృష్ణ, చంద్రశేఖర్, వెంకట్‌స్వామి, భరత్, వెంకట్‌నాయక్, రాములు, నారాయణ, భీమయ్య, మాణిక్‌రావు పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్లను ప్రారంభించాలి



సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న హర్షవర్ధన్‌రెడ్డి

మరికల్: లోవోల్టేజీ సమస్య పరిష్కారంకోసం ఐదేళ్ల క్రితం ప్రారంభించిన విద్యుత్ సబ్‌స్టేషన్లకు కరెంట్ పునరుద్ధరించి వాటిని ప్రారంభించాలని టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని అప్పంపల్లిలో 2018 ఆగస్టు 12న ప్రారంభించిన 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సబ్‌స్టేషన్ ప్రారంభించి సరిగ్గా ఐదు సంవత్సరాలు పూర్తికావడంతో ముళ్లచెట్లు అల్లుకున్నాయని గుర్తుచేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా వెంకటాపూర్, గున్ముక్ల, విఠాలపూర్, కొల్లంపల్లి, జాలాల్‌పూర్, కన్మనూర్ గ్రామాల్లో పూర్తిచేసిన సబ్‌స్టేషన్లను ఓట్లకోసం 2018లో ప్రారంభించారని విమర్శించారు. అప్పటి నుంచి ఇప్పటివరకు అవి దిష్టిబొమ్మల దర్శనమిస్తున్నట్లు ఆరోపించారు. అలాగే కొండాపూర్ 132/11 కేవీ విద్యుత్‌సబ్‌స్టేషన్ మంజూరుచేసి ఎనిమిదేళ్లు గడుస్తున్నా నేటికీ శంకుస్థాపనకు నోచుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కృష్ణయ్య, వెంకట్‌రెడ్డి, అనంతర్‌రెడ్డి, దామోందర్‌రెడ్డి, కృష్ణయ్య, జయసింహారెడ్డి పాల్గొన్నారు.

ముందస్తు అరెస్టులు అప్రజాస్వామికం



నర్వ పోలీస్‌స్టేషన్‌లో అరెస్ట్ అయిన నాయకులు



మరికల్‌లో పోలీస్‌స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

నర్వ: రాష్ట్రంలో ప్రతిపక్షాలను ధర్నాలు చేయకుండా ముందస్తు అరెస్టులు చేయడం అప్రజాస్వామికమని బీజేపీ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి అన్నారు. శనివారం రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి చేపట్టిన చలో ఇందిరాపార్కు ధర్నాకు వెళ్తున్న నాయకులను స్థానిక పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం డబుల్‌బెడ్రూం ఇవ్వకుండా దాటవేయడంపై చేపట్టిన ధర్నాకు వెళ్తున్న వారిని అక్రమంగా అరెస్టు చేయడం తగదన్నారు. అరెస్ట్ అయిన వారిలో నాయకులు పెద్దింటి ఆంజనేయులు, నరేందర్‌రెడ్డి, కురుమూర్తి, డిజె రవి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

దామరగిద్ద: నిరుద్యోగ భృతిచెల్లించాలని డిమాండ్ చేస్తూ అంసెబ్లీ ముట్టడికి తరలివెళ్లేందుకు యత్నించిన మండల బీజేపీ నాయకులను శనివారం ఉదయం స్థానిక పోలీసులు ముందుస్తు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ.. ఎన్నికల ముందు బీఆర్‌ఎస్ ఇచ్చిన హామిని అమలు చేయాలని, అసంబ్లీ ముట్టడి చేపడితే ప్రభుత్వం పోలీసులతో ముట్టడిని అడ్డుకోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో నాయకులు ఉప సర్పంచ్ శ్రీనివాస్ మాణిక్, కన్కిరెడ్డి ఉషేనప్పపాల్గొన్నారు.

మరికల్: డబుల్‌బెడ్రూం ఇళ్ల నిర్మాణాలపై ప్రభుత్వం వైఖరి ఎమిటో తెలుపాలని చేపట్టిన మహాధర్నాకు తరలివెళ్తున్న బీజేపీ నాయకులను శనివారం స్థానిక పోలీసులు అరెస్టచేసి స్టేషన్‌కు తరలించారు. కేసీఆర్ అమలు చేసిన డబుల్‌బెడ్రూం ఇళ్లు అర్హులకు అందజేసేవరకు బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతామన్నారు. అనంతరం వారిని సొంత పూచికత్తుపై విడుదల చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, శ్రీరాం, వేణు, రాము, నరేష్‌గౌడ్ పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరిస్తాం



పెన్సనర్స్ సమావేశంలో పాల్గొన్న సభ్యులు

మక్తల్: పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని సంఘం అధ్యక్షుడు బి. గోపాలం అన్నారు. శనివారం జిల్లా పరిషత్ బాలిక ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.. సమావేశానికి 40మంది పెన్షనర్స్ పాల్గొని వారికి సమస్యలను తెలియజేయగా, వాటిని పరిష్కరిస్తామని తెలిపారు. ఈ నెల 15న పెన్షనర్స్ సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్‌చౌరస్తాలో నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవానికి సభ్యులందరూ హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు నాగప్ప, కిష్టయ్యగౌడ్, సూర్యప్రకాష్, సిద్ధలింగయ్య, విద్యావతి, సుజాత, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివి



నారాయణపేట రూరల్: దేశం కోసం అమరవీరులు చేసిన ప్రాణ త్యాగాలు వెలకట్టలేనివని వక్తలు కొనియాడారు. పార్టీలకు అతీతంగా భారత ప్రభుత్వం చేపడుతున్న మేరా మట్టి–మేరా దేశ్ నినాదంతో దేశవ్యాప్తంగా 7500గ్రామాల నుంచి మట్టిని సేకరిస్తుంది. శనివారం పట్టణంలోని బహార్‌పేట తిరుమలదేవునిగుట్టలో పూజలుచేసి మట్టిని కలసంలో తీసుకుని భజనా సంకీర్తనల ద్వారా ఊరేగించారు. అంతకుముందు ప్రతిజ్ఞ చేశారు. గోపాల్‌యాదవ్, మల్లేష్, రఘువీర్‌యాదవ్, సత్యాయాదవ్, లక్ష్మి, రఘురామయ్యగౌడ్, నందునామాజి పాల్గొన్నారు.

రిటైర్డ్ సైనిక ఉద్యోగికి సన్మానం



నారాయణపేట రూరల్: ఆజాదికా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా శనివారం బీజేపీ ఆధ్వర్యంలో రిటైర్డ్ సైనిక ఉద్యోగిని సన్మానించారు. పేరపళ్లకు చెందిన జగన్మోహన్‌రెడ్డి ఆర్మీలో పనిచేస్తూ పదవీ విరమణ పొందగా, ఆయనను స్థానిక కమ్యూనిటీ హాల్‌కు పిలిపించి శాలువా, పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. మోదీ ఆధ్వర్యంలో దేశరక్షణ వ్యవస్థ చక్కగా పనిచేస్తుందని, కేంద్రం పూర్తిసహకారం అందిస్తుందన్నారు. నర్సింహులు, కిష్టప్ప, రాములు, ఓబన్న, ఈరప్ప, భీమప్ప, ఓంప్రకాష్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

నర్వ: మంలంలోని లంకాల్ గ్రామానికి చెందిన దండు చెన్నప్ప అనారోగ్యంతో మృతిచెందారు. శనివారం ఆయన కుటుంబానికి బీఆర్‌ఎస్ నాయకులు దండు అయ్యప్ప ఆర్థికసాయంగా రూ. 10వేలు నగదును అందజేశారు. అనంతరం బాధిత కుటుంబానికి పరామర్శించారు. బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు డా. వెంకటేశ్వర్‌రావు, డా. శంకర్, శ్రీధర్‌శెట్టి, కృష్ణారెడ్డి, నర్సింహసాగర్, ఆంజనేయులు, బొజ్జన్న ఉన్నారు.